భ్రూణహత్యలపై కదలిన యంత్రాంగం

సంచలనం రేపిన 'నమస్తే' కథనం

- హుజూరాబాద్, జమ్మికుంటలో కలకలం
- రంగంలోకి ప్రత్యేక బృందం
- తీగలాగితే కదులుతున్న డొంక
- వెలుగులోకి అనేక ఆసక్తికర అంశాలు
- హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్‌హోంలోనే అబార్షన్ జరిగినట్టు నిర్ధారణ
- ఓ ప్రభుత్వ వైద్యురాలు కీలకపాత్ర!
- ఆధునిక వైద్య పరికరాలతో అడ్డగోలుగా అబార్షన్లు
- కూపీలాగుతున్న హుస్నాబాద్ పోలీసులు
- నిద్రపోతున్న వైద్యారోగ్య శాఖ

హుజూరాబాద్, జమ్మికుంట కేంద్రంగా జరుగుతున్న భ్రూణహత్యలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. కొంత కాలంగా ఆధునిక పరికరాలతో అడ్డగోలు అబార్షన్లు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ బాగోతం బట్టబయలు కాగా, ఇదే విషయాన్ని 'చిదిమేసింది ఎవరు?' శీర్షికన 'నమస్తే తెలంగాణ' మంగళవారం ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. దీంతో మొత్తం యంత్రాంగమే కదిలింది. హుస్నాబాద్ పోలీసులు ఒక ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించగా, విచారణలో అనేక అంశాలు వెలుగుచూస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రధానంగా హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్‌హోంలోనే యువతికి అబార్షన్ జరిగినట్టు నిర్ధారించి ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడమే కాకుండా సదరు దవాఖాన నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. అబార్షన్ల విషయంలో ఈ ప్రాంతంలో పనిచేసే ఓ ప్రభుత్వ వైద్యురాలు కీలక పాత్ర పోషిస్తుండగా.. ఒక ఆర్ఎంపీ, ఒక నర్సు కూడా ప్రధాన సూత్రదారులుగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఒక యువతి అబార్షన్ మాత్రమే వెలుగులోకి వచ్చినా.. జమ్మికుంట, హుజూరాబాద్‌లోని పలు వైద్యశాల్లో దందా యథేచ్ఛగా నడుస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కూపీ లాగితే డొంకంతా కదులుతుండగా, జిల్లా వైద్యారోగ్యశాఖ మాత్రం మొద్దు నిద్ర పోతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కరీంనగర్, జూలై 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాలే కేంద్రాలుగా జరుగుతున్న భ్రూణహత్యలు, హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు, గతంలో జరిగిన అరెస్టులు వంటి అంశాలను కండ్లకు కట్టినట్టుగా 'చిదిమేసింది ఎవరు?' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' మంగళవారం కథనం ప్రచురించింది. దీనిపై ఇప్పటికే కొన్ని అరెస్టులు జరిగినా.. అసలు సూత్రదారులెవరో తేల్చి, ఈ దందాకు అడ్డుకట్టవేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. దీనిపై స్పందించిన హుస్నాబాద్ పోలీసులు, స్పెషల్ ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది. సూత్రదారులను పట్టుకోవడంతోపాటు పూర్తిగా కూపీ లాగేందుకు ఓ ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించినట్టు విశ్వసనీయ సమాచారం. వీరి విచారణలో అనేక అంశాలు వెలుగు చూస్తున్నట్టు తెలుస్తున్నది. నిజానికి ఇది ఒకటి రెండు రోజులుగా నడుస్తున్నది కాదని, కొన్నేళ్లుగా ఈ దందాలకు పాల్పడుతున్నట్టుగా సదరు పోలీసులు గుర్తించారు. బాధితురాలు ఫిర్యాదు ప్రకారం చూస్తే.. ఓ ప్రభుత్వ వైద్యురాలు కీలక పాత్ర పోషించినట్టు, ఆమె ఇదే ప్రాంతంలో పనిచేయడంతోపాటు ప్రధానంగా అబార్షన్లు చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్టు తెలిసింది. ఆమెకు ఒకరిద్దరు నర్సులు పూర్తిగా సహకారం అందిస్తున్నారు. ఆ మేరకు యువతి అబార్షన్ ప్రక్రియ హుజూరాబాద్‌లోని మాధవినర్సింగ్ హోంలోనే జరిగినట్టు పోలీసులు గుర్తించారు. అంతే కాదు, ఎఫ్ఐఆర్‌లో ఈ నర్సింగ్‌హోం పేరును కూడా చేర్చారు. ప్రస్తుతం ఈ నర్సింగ్‌హోంను నడుపుతున్నదెవరు? ఇప్పటివరకు ఎన్ని భ్రూణహత్యలు చేశారు? అందులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నదెవరు? అబార్షన్లు చేస్తున్నదెవరు? ఎంతకాలంగా ఈ దందా నడుస్తున్నది? అబార్షన్లకు ఎటువంటి ఎక్విప్‌మెంట్ వాడుతున్నారు? ఇలా అన్ని కోణాల్లో విచారణ చేస్తుండగా, పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తున్నది. అబార్షన్లకు అధునాతన పరికరాలను వినియోగిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో దవాఖాన నిర్వాహకులతోపాటు అబార్షన్‌లో కీలకపాత్ర పోషించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు పోలీసులు అన్ని సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. అయితే ఈ విషయంలో మరింత లోతుగా వెళ్తే చాలా మంది బాగోతం బట్టబయలుకానున్నది. యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ముందుకెళ్తుండగా.. స్థానికంగా ఉండే కొంతమంది పోలీసులు సహకరించడం లేదన్న విమర్శలు సైతం వస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని హుస్నాబాద్ పోలీసులు బట్టబయలు చేస్తే.. తమ ఉద్యోగాలకు ఇబ్బందులు వచ్చే ప్రమాదముందని భావించి, ముందుకెళ్లకుండా చూస్తున్నట్టు తెలుస్తున్నది. అంతేకాకుండా ప్రత్యేక పోలీస్ బృందాల మూమెంట్‌ను సైతం కొంత మంది సదరు దవాఖాన నిర్వాహకులకు ముందుగానే తెలుపుతున్నట్టు తెలిసింది. అయితే భ్రూణహత్యలకు అడ్డుకట్ట వేయాలంటే సమన్వయంతో పనిచేస్తే తప్ప సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో దొంగలను బయటకు లాగాలంటే స్థానిక పోలీసులు కూడా పూర్తి సహకారం అందించాల్సిన అవసరముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కొంతమంది స్థానిక పోలీసులు.. కొంత మంది దవాఖాన నిర్వాహకులను, వైద్యులను పిలిచి, తూతూ మంత్రంగా హెచ్చరించి, తమ పని అయిందన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

కక్కుర్తితో మగబిడ్డల భ్రూణహత్యలు

జమ్మికుంట, హుజూరాబాద్‌లోని పలు దవాఖానలు కాసుల కోసం ఎంతకైనా దిగజారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. అబార్షన్లు చేయడంలో ఒకటికి మించి మరొకటి పోటీపడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో అబార్షన్‌కు లక్షకు పైగా దండుకుంటున్నట్టు తెలుస్తున్నది. అందులో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. లింగ నిర్ధారణలో పుట్టేది మగ అని తెలిసినా ఆ విషయాన్ని దాచి, కాసుల కక్కుర్తితో కొంత మంది వైద్యులు, హాస్పిటళ్ల నిర్వాహకులు కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తప్పుడు రిపోర్టులు ఇవ్వడమే కాకుండా ఆపై భ్రూణహత్యలకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. దవాఖానల దురాశకు ఎంతో మంది బలైనట్టు తెలుస్తున్నది. అంతేకాదు.. రెండు, మూడు నెలలైతే ఒక రేటు, నాలుగు నుంచి ఆరు నెలలైతే మరో రేటు, ఆపై అయితే లక్షల్లో గుంజుతున్నట్టు తెలిసింది. లింగనిర్ధారణతోపాటు అబార్షన్లు విచ్చలవిడిగా చేస్తుండడంతో కొంత మంది ఆర్ఎంపీలు.. వివిధ గ్రామాల నుంచి సదరు దవాఖానలకు తీసుకొచ్చి కమీషన్లు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఓ ఇద్దరు ఆర్ఎంపీలు అయితే ఏకంగా ఇదే పనిపై ఉన్నారని విమర్శలు వస్తున్నాయి. బాధితుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒక్కొక్కరికి ఒక్కో రేటు నిర్ణయించి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ దందాకు అడ్డూ అదుపు లేకపోవడంతో చుట్టుపక్కల ఉన్న మూడు నాలుగు జిల్లాల నుంచి గర్భిణులను తీసుకొచ్చి ఇక్కడ ఆర్ఎంపీలు అబార్షన్లు చేయిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాలన్నీ పోలీసుల విచారణలో బయట పడుతున్నట్టు తెలుస్తున్నది.

నిద్రపోతున్న వైద్య ఆరోగ్యశాఖ

భ్రూణహత్యలపై చర్యలు తీసుకోవాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ నిద్రపోతున్నది. అందుకు నిదర్శనం జమ్మికుంట, హుజూరాబాద్‌లో విచ్చలవిడిగా జరుగుతున్న అబార్షన్లే. కొద్ది నెలల క్రితం జమ్మికుంటకు చెందిన ఒక దవాఖానలో భ్రూణహత్యకు సంబంధించి అంశాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఆనాటి జిల్లా వైద్యాధికారి.. సదరు దవాఖానను సీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ విషయంలో ఏమి జరిగిందో తెలియదు కాదు కానీ, కొన్నాళ్లకే ఆ హాస్పిటల్ తెరుచుకున్నది. దీంతో మిగిలిన దవాఖానలకు సైతం బలం చేకూరినట్టు తెలుస్తున్నది. ఏమిచేసినా ఏమి కాదులే.. డబ్బులతో వైద్యశాఖాధికారులను మేనేజ్ చేయవచ్చన్న బలమైన అభిప్రాయం ఈ ప్రాంతంలోని కొంత మంది నిర్వాహకుల్లో ఏర్పడింది. దీంతో వీరి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయినట్టు తెలుస్తున్నది. ఇటు పూర్తి స్థాయిలో చర్యలు లేకపోవడం కూడా అనుమానాలకు తావిస్తున్నది. హుస్నాబాద్‌లో యువతి ఫిర్యాదు చేయడం, ఆ వ్యవహారంలో కొంతమందిని అరెస్ట్ చేయడం వంటివి జరిగిన తర్వాత కూడా వైద్య, ఆరోగ్యశాఖ సదరు దవాఖానలో తనిఖీలు నిర్వహించలేదు. కనీస చర్యలు తీసుకోలేదు. దీనిని బట్టి చూస్తే వైద్య, ఆరోగ్యశాఖ నిద్ర మత్తులో ఉందా..? లేక మామూళ్ల మత్తులో ఉందా..? అన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం తేరుకొని హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా.. సదరు వైద్యశాలపై చర్యలు తీసుకోవడంతోపాటు మిగిలిన దవాఖానలపై నిఘా పెట్టాల్సి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నేతన్నల ప్రాణాలు తీస్తున్న సర్కార్

ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్

కేటీఆర్ చేసిన పోస్ట్

రాజన్న సిరిసిల్ల, జూలై 9 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయి. సర్కారు నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే పది మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బతుకమ్మ చీరల పంపిణీ నిలిపివేసి నేతన్నల ప్రాణాలు తీస్తున్నది' అంటూ రేవంత్‌రెడ్డి సర్కారుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అనాలోచిత నిర్ణయాలు మాని.. నేతన్నలు, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మరమగ్గాలు, చేనేత కార్మికులపై కక్షగట్టి వారి ప్రాణాలు తీస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో చేనేత, మరనేతన్నల ఆత్మహత్యలు నివారించి, బతుకమ్మ చీరల ఆర్డర్ల ద్వారా వారికి ఉపాధి కల్పించామని తెలిపారు. బతుకమ్మ చీరల ఆర్డర్ల కారణంగా నేతన్నల ఆత్మహత్యలు ఆగిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. ఏటా ₹350కోట్ల విలువైన బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లతో నేతన్నలకు చేతినిండా పని కల్పించినట్టు తెలిపారు. పేదింటి ఆడబిడ్డలకు కానుకగా కోటి బతుకమ్మ చీరల పంపిణీకి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. చీరల పంపిణీతో మరమగ్గాల పరిశ్రమతో పాటు అనుబంధ రంగాల్లో పనిచేసే వేలాది మందికి ఉపాధి లభించిందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రభుత్వంపై తమపై కక్షతో బతుకమ్మ చీరల పంపిణీ నిలిపివేసేందుకు కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. నేతన్నలు, చేనేత కార్మికుల ఉసురు తీయవద్దని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి.. నేతన్నలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బతుకమ్మ ఆర్డర్లు రద్దు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనం మేరకు కేటీఆర్ పై విధంగా స్పందిస్తూ పోస్ట్ చేశారు.

నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, బుధవారం 10 జూలై 2024 | KARIMNAGAR

జీతాలు సక్కగ వస్తలేవు..

నేను గంగాధర జడ్పీ స్కూల్లో మధ్యాహ్న భోజన వండుతా. మాకు జీతాలు సక్కగ వస్తలేవు. వచ్చే రూ.3 వేలల్లో రెండు కోత పెట్టి రూ.వెయ్యి ఇస్తున్నరు. మిగిలినయి తర్వాత వస్తయని సార్లు అంటున్నరు. అసలే చిన్న జీతం. అండ్ల కోత పెడితే జీవితం ఎట్ల సాగుతది. 9,10వ తరగతి పిల్లలకు ఆర్నెల్ల సంది పైసలు వస్తలేవు. ఎనిమిదో తరగతి వాళ్లకు రెండు నెలల నుంచి వస్తలేవు. కోడి గుడ్లకు సుతం ఇస్త లేరు. అప్పులు జేసి పిల్లలకు మధ్యాహ్నం బువ్వ పెట్టుడు అయితంది. పైసలు రాక అల్పాహారం కూడా బంద్దైంది. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ మొత్తం ఇయ్యాలె. జీతం పెంచాలె.

- తాళ్ల లక్ష్మి, గంగాధర, మధ్యాహ్నభోజన నిర్వాహకురాలు

సమస్యల వలయంలో సర్కారు బడి

నిర్వహణను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం!

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గదులు లేక చెట్టు కింద బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- వంట ఏజెన్సీలకు అందని వేతనాలు
- గోసపడుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు
- ఉపాధ్యాయుల పదోన్నతులతో కరువైన బోధకులు
- కనీస మౌలిక వసతులూ కరువు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- సమస్యలే లేవంటున్న రాష్ట్ర సర్కారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖతో బయట పడుతున్న వాస్తవాలు
- 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్‌లో వెలుగులోకి అనేక సమస్యలు

సర్కారు బడులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మొన్నటిదాకా సకల వసతులు, రోజూ తీరొక్క బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం మిడ్డేమీల్స్, సబ్జెక్టు టీచర్లతో ఆహ్లాదకరంగా సాగిన చదువులు, కాంగ్రెస్ సర్కారు ఆరు నెలల పాలనలోనే అటకెక్కుతున్నాయి. పాఠశాలల నిర్వహణ గాలికి వదిలేయడం వల్ల విద్యార్థులే కాదు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అన్నీ ఇబ్బందులే ఎదురవుతుండగా, మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖతో వాస్తవాలు బయటకొస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయిలో పరిశీలించగా అనేక సమస్యలు, లోటుపాట్లు వెలుగులోకి వచ్చాయి. పదోన్నతులతో ఏర్పడిన బోధకుల కొరత, వేతనాలు రాక, బిల్లులు మంజూరుకాక వంట ఏజెన్సీలు పడుతున్న బాధలు.. ఇలా అనేక సమస్యలు వెలుగుచూశాయి.

ఈ స్కూల్ కరెంట్ బిల్ రూ.30 వేలు దాటింది!

ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ పాఠశాల

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఉన్న జడ్పీ హైస్కూల్‌కు మంగళవారం 'నమస్తే తెలంగాణ' వెళ్లిన సమయంలో ప్రధానంగా మూడు సమస్యలు కనిపించాయి. 270 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులు, ఒక ప్రధానోపాధ్యాయుడు పనిచేస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. విశాలమైన స్థలంలో ఉన్న పాఠశాలలో చాలినన్ని తరగతి గదులు కనిపించాయి. అయితే, హెచ్ఎం రాజయ్యతో మాట్లాడిన సమయంలో పాఠశాల విద్యుత్ బిల్లుల చెల్లింపు పెద్ద సమస్యగా మారినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.30 వేలకు పైగా బకాయి ఉందన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వడం లేదని, దీంతో ఏ క్షణంలో కరెంట్ కనెక్షన్ కట్ చేస్తారో తెలియడం లేదన్నారు. ''మన ఊరు.. మన బడి'' పథకంలో భాగంగా పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు, పాఠశాలలోని తరగతి గదుల్లో ఎల్ఈడీఫికేషన్ చేశారని, ప్రతి తరగతి గదితో పాటు స్టాఫ్, హెచ్ం గదుల్లో ఫ్యాన్లు అమర్చారారని, ప్రతి గదికి రెండు నుంచి మూడు ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. వీటితో పాటు పాఠశాలలకు నీటి సౌకర్యం కోసం బోరు వేయించారని చెప్పారు. బోరు, ట్యూబ్‌లు, ఫ్యాన్ల వినియోగంతో ప్రతి నెలా పెద్ద మొత్తంలో కరెంట్ బిల్లు వస్తున్నదని, నిధులు లేకపోవడంతో చెల్లించడం లేదన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్ర శాలల కొరత తీవ్ర స్థాయిలో ఉందన్నారు. స్టాఫ్, పిల్లలతో కలిసి దాదాపు 300 మంది ఉంటే, కేవలం రెండు మూత్రశాలలు మాత్రమే ఉండటం సమస్యగా ఉందన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదులు

సమస్యల నిలయంగా ధర్మపురి స్కూల్

ధర్మపురి, జూలై 9 : ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. మంగళవారం 'నమస్తే తెలంగాణ' జరిపిన క్షేత్ర పరిశీలనలో పలు సమస్యలు గుర్తించింది. 400లకు పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో పారిశుధ్యం సమస్య ప్రధానంగా ఉన్నది. పాఠశాల పక్కనే గల కాలనీకి సంబంధించిన మురుగు కాలువ తరగతి గదుల పక్క నుంచే పారుతుండడంతో విపరీతమైన దుర్గంధం వస్తున్నది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మూడు గదులు శిథిలావస్థకు చేరగా, వాటిని ప్రస్తుతం స్టోర్ రూములుగా ఉపయోగిస్తున్నారు. వాటి స్థానంలో అదనపు గదులు నిర్మించాల్సి ఉంది. గత విద్యా సంవత్సరంతోపాటు ఈ విద్యాసంవత్సంలో మొత్తం నాలుగు నెలల మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కూరగాయల బిల్లులు కూడా నాలుగు నెలలుగా రావడం లేదు. పాఠశాలలో కార్యాలయ పనులు నిర్వహించేందుకు ఒక జూనియర్ అసిస్టెంట్, అలాగే స్వీపర్ పోస్టులను మంజూరు చేయాల్సి ఉంది. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్లుగా టాయ్‌లెట్స్ లేవు.

అల్మాస్‌పూర్‌లో ఫిజిక్స్ క్లాస్ తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు కుమార స్వామి

ఫిజిక్స్ టీచర్ పోస్టు ఖాళీ.. హెచ్ఎం సారే మాస్టారు

ఈ చిత్రంలో పిల్లలకు ఫిజిక్స్ తరగతులు బోధిస్తున్నది అల్మాస్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుమార స్వామి. ఈ స్కూల్లో పదేండ్ల నుంచి ఫిజిక్స్ టీచర్‌గా పనిచేసిన విక్రమ్‌రెడ్డి గత జూన్ 7వ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడు చేరకపోవడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఫిజిక్స్ పాఠాలు ముందుకు సాగక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో హెచ్ఎం కుమార స్వామి తనకు తోచిన మేరకు ఫిజిక్స్ క్లాస్ తీసుకుంటున్నారు. విద్యా సంవత్సరం మొదలు కావడంతో పాఠశాలలో అడ్మిషన్లు, పాఠశాల నుంచి కళాశాలకు వెళ్లే విద్యార్థులకు టీసీలివ్వడం, దాంతో పాటు అనేక పనులతో బిజీగా ఉండే ఆయన, అనుకున్న స్థాయిలో దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడుతున్నది. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లారని, ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడు వచ్చేదాకా విద్యార్థులు సబ్జెక్టు నష్టపోవద్దనే ఉద్దేశంతో కష్టమైనా క్లాసులు తీసుకుంటున్నానని హెచ్ఎం చెబుతున్నారు.

- ఎల్లారెడ్డిపేట, జూలై 9

కరీంనగర్, జూలై 9 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులైన కుక్‌లు, హెల్పర్లకు గతేడాది డిసెంబర్ వరకే గౌరవ వేతనం అందింది. ఈ యేడాది జనవరి నుంచి గౌరవ వేతనాలు అందలేదు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9,10 తరగతుల మధ్యాహ్న భోజన బిల్లులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్ నెలలవి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటు 1 నుంచి 8వ తరగతి ఏప్రిల్ వరకు మాత్రమే వచ్చాయి. గత నెలవి పెండింగ్‌లో ఉన్నాయి. కోడి గుడ్ల బిల్లులు ఫిబ్రవరి నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించలేక పోతున్నామని, అప్పులు చేయాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. బిల్లులు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు పిల్లలు కూడా మధ్యాహ్న భోజనం అందక ఆకలితో అలమటిస్తున్నారని చెబుతున్నారు. అలాగే సర్వ శిక్ష అభియాన్, ఐఈఆర్‌పీల వేతనాలు కూడా రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' పాఠశాలలను సందర్శించగా, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సర్వశిక్ష అభియాన్ రిసోర్స్ పర్సన్స్, విద్యార్థులు తమ ఆవేదనను వెలిబుచ్చారు.

- గతంలో పాఠశాలల పారిశుధ్య నిర్వహణ పంచాయతీల సిబ్బంది ద్వారా నిర్వహించేది. ఇప్పుడు ఆ బాధ్యతలను అమ్మ కమిటీలకు అప్పగిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇది అమలుకు రాలేదు. దీంతో అనేక పాఠశాలల్లో పారిశుధ్య సమస్యల తీవ్రత కనిపించింది..
- గతంలో ఒక్కో నియోజకవర్గంలో కొన్ని పాఠశాలలను తీసుకుని సీఎం బ్రేక్ ఫాస్ట్ కింద విద్యార్థులకు ప్రతి రోజూ అల్పాహారం ఇచ్చేది. ఇప్పుడు ఏ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని అమలు చేయడం లేదు. ఇంటి నుంచి వచ్చే ముందు ఎలాంటి ఆహారం తీసుకోకుండా బడికి వచ్చే పేద పిల్లలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉండేది.
- పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ ఈ హామీ ఇప్పటి వరకు నెరవేర లేదు. అధికారిక ఉత్తర్వులు లేక పోవడంతో కొన్ని చోట్ల విద్యుత్తు అధికారులు సరఫరా నిలిపి వేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది..
- ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించిన కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. పాఠాలు బోదించే వారు లేక పోవడంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లలేని విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

నిధులు రాక టిఫిన్ పెడుతలేం..

సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌కు నిధులు రాకపోవడంతో ఆపేసినం. గతంలో ఒకసారి మూడు నెలల బిల్లు వచ్చింది. ఆ డబ్బులతోనే జూన్ 26 దాకా పిల్లలకు టిఫిన్లు పెట్టినం. నిధులు ఇస్తే మళ్లీ టిఫిన్లు చేసి పెడుతం. ఇప్పటికే మేం సొంతంగా కొన్ని నెలల నుంచి డబ్బులు పెట్టుకున్నం. టిఫిన్లు చేసినప్పుడు విద్యార్థులు తొందరగ వచ్చేటోళ్లు. ఇప్పుడు లేటుగా వస్తున్నరు. కొందరు ఏమీ తినకుండా వస్తున్నరు. మధ్యాహ్న భోజనం చేసే సరికి ఒంటి గంటవుతుంది. అప్పటి దాకా కొందరు పిల్లలు పస్తులుంటున్నరు. సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం మళ్లీ ప్రారంభించాలి. మాకు ఎలాగైనా డబ్బులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కొంతం భాగ్యమ్మ, మధ్యాహ్న భోజన వర్కర్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, (పెద్దపల్లి)

గాడితప్పిన నెహ్రూనగర్ స్కూల్

విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన వంట చేస్తున్న మహిళలు

ఇది సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జడ్పీ పాఠశాల. ఇక్కడ చదివేది మొత్తం నేత కార్మికుల పిల్లలే. ఒకప్పుడు చిన్న చిన్న గదులతో శిథిలావస్థలో కొట్టుమిట్టాడే ఈ స్కూల్‌లో 140 మంది అభ్యసించేవారు. గత కేసీఆర్ ప్రభుత్వం 'మన ఊరు-మనబడి' కింద పాత భవనాన్ని తొలగించి సకల హంగులతో ఆధునిక భవంతిని నిర్మించింది. చిన్నారులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, కడుపు నిండా సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెట్టింది. ఏడాదిలోనే విద్యార్థుల సంఖ్య 307కి పెరిగింది. కానీ కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత పట్టింపులేక పాఠశాల నిర్వీర్యమైపోతున్నది. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు ఆగిపోయాయి. జీతాలు కూడా రావడం లేదు. బ్రేక్ ఫాస్ట్ పూర్తిగా బంద్ అయిపోయింది. కేవలం రాగి అంబలి ఇస్తున్నా, విద్యార్థులు తాగలేక ఆకలితో అలమటిస్తున్నారు. ప్రార్థన సమయంలో ఒంట్లో సత్తువ లేక కిందపడి పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇక